# వాన వెలిసింది

గుళ్లో పూజచేసి ఇంటికి మళ్లింది విమల. బళ్లో పాఠాలు చెప్పి ఒంటరిగావెళ్లాడు వేణు.

క్రొత్త పెళ్ళికూతురులా అలంకరించుకుని మెల్లమెల్లగా నడుస్తూంది విమల-ఆమె మనసు అనాసకాయ లాగుంది!

మొసుకొని మొత్తుకొని విద్యార్థుల బుర్రల్లో క్రొత్త విజ్ఞానం నింపి వస్తున్నాడు వేణు-అతని మనసు పనసకాయ లాగుంది!

విమలను చూడగానే కమలంలా వికసించాడు వేణు.

వేణును చూడగానే వీణ మీటినట్లయ్యింది విమలకు.

'ఇంత చక్కగావున్న విమలను ఏమని వర్ణిద్దామా?' అనుకున్నాడు వేణు.

'విమలమీద ఓ ఇరవై పద్యాలు వ్రాస్తే బాగుంటుంది-కాని. ఇదేమిటి? ప్రబంధ కవుల్లాగ స్త్రీవర్ణనకు యిన్ని పద్యాలు వ్రాయడం-భావకవిలా ఒక్క ముక్కలో పలికితే సరిపోతుంది' అనుకున్నాడు.

వెంటనే 'ప్రక్కింటి పిన్నిగారి పెరట్లో ముద్దబంతి పువ్వులాగుంది విమల' అనేశాడు వేణు.

'పెండ్లి చేసుకోనని పంతం పట్టేవాళ్లకు ఈమెను చూపిస్తే సరి—విశ్వామిత్రుడిలా తల్లక్రిందులౌతారు—పోనీ,గాని ఇవ్వాళ తప్పనిసరిగా విమలను పలకరిద్దాం' అనుకున్నాడు. ఇద్దరూ ఎదురుపడ్డారు.

'ఒంటరిగా వస్తున్న వేణును తలెత్తి చూద్దామా' అనుకుంది విమల.

'విమల భూస్వామి ఏకైక పుత్రిక-నాకివ్వరు. కాని ప్రయత్నం మానకూడదు' అనుకున్నాడు వేణు.

'వేణు బి. ఎ. బి. ఇడి. చదువుకున్నాడు నాతో మాట్లాడుతాడా? నన్ను థర్డ్ ఫారంతో మాన్పించారు మా వాళ్ళు. అయినా నాకేం?' అనుకుంది విమల—సగర్వంగా—

ఇద్దరూ మరీ దగర కొచ్చారు.

'అరెరె...దాటిపోతుంది. మాట్లాడితే బాగుండును. ఏమైనా అందామా? మళ్ళీ యింత అవకాశం రాదు...'

'దాటిపోతున్నాడు. తలెత్తి చూద్దామా? ఇంతవరకు అయన్ని తలెత్తి చూడలేదు.'

'అయ్యయ్యో...మీ వెనకాల! అదిగో!' అని పెద్దగా అన్నాడు వేణు. గుండె జల్లుమందో లేదో తెలియదు. కాని ఎగిరి ఒక్కగంతు ముందుకు వేసింది విమల.

ఆ కుదుపుకు కదిలిపోయిన గులాబిపువ్వు ఆమె జడలోనుండి దూకింది.

ఆ పువ్వును ఒడిచి పట్టుకున్నాడు వేణు.

'మీ పొడవైన జడను పామనుకున్నాను అని అందామా?' అనుకున్నాడు వేణు.

విమల వెనుదిరిగి వేణుకేసి చూసింది.

గులాబి పువ్వు ఘుమ ఘుమను ఆస్వాదిస్తున్నాడు వేణు—సన్నగా నవ్వుతూ—

'కిరీటంలేని కృష్ణదేవరాయలు లాగున్నాడే!' అనుకుంది. విమల.

'అయ్యో, నా పువ్వు పోయిందే!' అన్నట్లు చూసిందామె.

## మిక్కిలి సుందరరావు

'దొరికిన సొమ్ముకు దొంగా?' అన్నవి వేణు కళ్లు.

'నా పువ్వు యిచ్చెయ్యండి.' అని అందామనుకుంది విమల.

'ఈ పువ్వును నేను' లవ్ 'చేశాను' అందామనుకున్నాడు వేణు. కాని యిద్దరూ ఫేలయ్యారు.

'నీ చూపులు ఎంత చల్లగా వున్నయ్' అనుకుంది విమల.

'వేణూ చూసే కోణాల ప్రభావం అది—'అన్నది వేణు మనసు—విమల మనసుతో—

'ఇదేమిటి యింతసేపు నిలబడ్డాను.—తప్పు!...' అనుకుని దాటిపోయింది విమల.

'పువ్వు యిస్తే తీసుకునేదేమో' అనుకుని వెళ్లిపోయాడు వేణు.

విమల యింటికివెళ్ళి తండ్రికి ప్రసాదం యిచ్చింది.

"మీ అమ్మను పిలువమ్మా" అన్నాడు కృష్ణమూర్తి ప్రసాదం సేవిస్తూ.

"అమ్మ పిన్నిగారింటికి వెళ్లింది. ఎందుకు నాన్నా?" అన్నది విమల.

మరేం లేదమ్మా, మన యింట్లో అద్దెకుంటున్నాడే వేణుగారు. ఆయన వున్నాడేమో—చూడమందామని—"

విమల వూరుకుంది.

"వేణు పెండ్లికాని కుఱ్ఱవాడు. మన ఇంట్లో అద్దెకుండడం, యేమంత బాగుంటుంది—చెప్పు...ఏమంటావ్?"

"నేనేమంటాను నాన్నా" అన్నది విమల ముభావంగా—

ప్రక్కింటి పిన్నిగారి చిట్టిపాప పరుగెత్తుకొచ్చింది—

"పెద నాన్నా, అక్క నన్ను తీసుకెళ్ళకుండా ఒక్కతే వెళ్ళింది గుడికి" అన్నది. కృష్ణమూర్తి చిట్టిపాపను కౌగిలించుకొన్నాడు.

"పోనీ, చిట్టెని కూడా తీసుకెళ్లకపోయావా, అమ్మా" అన్నాడు విమలతో.

"త్వరత్వరగా నడవలేదు నాన్నా—ఇక వర్షం వస్తే నన్ను చంపుకుతింటుంది ఎత్తుకోమని."

"సరేలే వుండమ్మా-మా బంతిచెట్టు రెండు ముద్దబంతిపూలు వేసింది. నీ కిస్తానేంటి?" అన్నది చిట్టి మురిపించుకుంటూ—

కృష్ణమూర్తి లేచి పైపంచ భుజాన వేసుకొని, చెప్పులు తొడుక్కొని, చేతికఱ్ఱ పట్టుకొని చుట్ట, వెలిగించుకొని, మీసాలు దువ్వుకుంటూ బయటికి వెళ్లాడు—కోటప్పకొండ ప్రభలాగ కదిలి—

వేణు వచ్చి తన గదితలుపు తెరుచుకొని, గులాబిపువ్వు బల్లమీద పెట్టుకొని బూట్లు విడిచి, ఇన్‌షర్టుకు విశ్రాంతి కలిగించి, పైజామా, లాల్చీ ధరించి, రేడియోబల్ల దగ్గర కూర్చున్నాడు.

"అదుగో మాష్టారొచ్చాడు. రేడియో పాడుతోంది" అని చిట్టిపాప విమల దగ్గర నుండి వేణు గదిలోకి పరుగుతీసింది.

వేణు విమలకు చిన్న లేఖ వ్రాశాడు.

"చిట్టీ, ఈ చీటీ తీసుకెళ్ళి మీ అక్కకిచ్చి వస్తావా?" అన్నాడు.

"మా అక్కకు నేనివ్వనండి. మా పెద్ద నాన్న కిస్తాను" అన్నది చిట్టి.

వేణు ఆశ్చర్యపోయాడు.

ఈ మాటలు విమలకు వినిపిస్తూనే వున్నాయి.

"ఎందుకని?" అన్నాడు వేణు.

"మా అక్క నన్ను గుడికి తీసుకువెళ్లలేదు."

"ఓ—అదా...అయితే మీ అక్క చెప్పినపని చెయ్యకు. మరి ఇది నేను చెప్పిన పనికదూ—చేస్తావా?"

"చేస్తే నాకేమిస్తావ్?"

"నీవు ఏది కోరుకుంటే, అదిస్తాను."

"అయితే నాకు మీబల్లమీదున్న గులాబి పువ్వు కావాలి."

వేణు సందిగ్ధావస్థలో పడ్డాడు.

"ఈ పువ్వు నీ పగవాళ్లదిలే—నిన్ను సినిమాకి తీసుకెళ్తాగా."

"అయినా, అవాడిపోయిన బోడి పువ్వు ఎవరిక్కావాలి?" అని ఉత్తరం తీసుకొని వెళ్ళిపోయింది చిట్టిపాప.

ఉత్తరం వెళ్ళినప్పటినుండి వేణుకి ఎన్నో ఆలోచనలొచ్చాయి. బోలెడుభయం పుట్టుకొచ్చింది. ఆమెను పొరబాటుగా అర్థంచేసుకున్నానేమో? ఒకవేళ ఆమె ఆలేఖ కృష్ణమూర్తిగారికి చూపిస్తే! ఆయన భార్య సుబ్బమ్మ ముక్కోపి!

అసలు ఈవూళ్ళో వుద్యోగం చెయ్యడానికి వీలవుతుందా? ఉత్తరం వ్రాయకుండా వున్నా బాగుండేది.

అసలు వ్రాయడమే మంచిది. తాడో పేడో తేలిపోతుంది. విమల నన్ను నగుబాట్లుపాలు చెయ్యదుకదా?

క్రొత్త ఆలోచన!—

ఇప్పుడు ఇంట్లో ఎవ్వరూ లేరు. పిలిచిఅడిగితే...అదేమంచిది.

విమలఅకస్మాత్తుగా వరండాలోకొచ్చింది.

వేణుకూడా వరండాలోకొచ్చాడు.

విమల పెళ్ళికొడుకులా తల యెత్తుకుంది!

వేణు పెళ్ళికూతురులా తల దించుకున్నాడు!

"ఉత్తరం అందిందా?" అన్నాడు ధైర్యం తెచ్చుకుని.

"ఓ...కాని అర్థంకాలేదు" అన్నది విమల తలయెత్తుకునే!

"తెలుగేగా? అర్థంకాలేదా?"

"కాలేదు"

"మరేంలేదు. నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను,"

"గోవిందా!...గోవిందా!" అనుకుంటూ యాత్రికులు తిరుపతి వెళ్తూ కేకలు వేస్తున్నారు—బైట రోడ్డుమీద.

"ఏమంటారు?" అన్నాడు వేణు.

"ఓ...యస్...ప్రేమించండి" అన్నది విమల.

"మరి మీరు?"

"ఎలా?"

"ఏం?"

"మానాన్నగారినడిగి...వారు అలాగే నంటే చూద్దాం"

విమలకు నవ్వువచ్చింది.




వికార వేషము—
కొంటెతనమా లేక అశ్రద్ధ ఫలితమా?

దుస్తులను కొనునప్పుడు 'సాన్ఫొరైజ్డ్' ('Sanforized') గురుతును తప్పకుండా గమనిస్తే అతను ఎంతో డబ్బు ఆదుపు చేసుకొని ఉండేవాడు మరియు చికాకులకు గురి కాకుండా కూడ ఉండేవాడు. 'సాన్ఫొరైజ్డ్' ట్రేడు మార్కుగల దుస్తులు ఎన్నో పార్లు ఉతికినాకూడ కుంగకుండా ఉంటాయి.


లేబిలు మీద ఈ గుర్తు 'SANFORIZED' REGD TD MK
ఉన్నదా అని గమనించండి

అలా చేస్తే మీ దుస్తులు చాలినట్లుగా ఎన్నటికీ కుంగవు!

రిజిష్టరు చేయబడిన 'సాన్ఫొరైజ్డ్' అనే ట్రేడు మార్కునకు అధికారులైన క్లూయట్, పీబోడీ అండ్ కంపెనీ ఇన్‌కార్పొరేటెడ్ (పరిమితమైన బాధ్యతతో యు. ఎస్. ఎ. లో సంస్థాపితము) వారిచే ప్రచురింపబడినది. ఈ కంపెనీ యొక్క కచ్చితమైన ప్రమాణములకు తగినట్లు కుంగకుండా ఉండే బట్టలమీదనే 'సాన్ఫొరైజ్డ్' ట్రేడు మార్కు వేయుటకు అంగీకారము యిస్తాము.

వివరములకు: 'సాన్ఫొరైజ్డ్' సర్వీస్. 9౯, మెరీన్ డ్రైవ్. బొంబాయి 2

ACP. 4366




తెలుగు వనితల గోరింటాకు పండుగనాడు పిల్లలతో తల్లి

—చిత్రకారుడు : వల్లటూరి పూర్ణానందశర్మ.]

# వాన వెలిసింది

వేణుకి అయోమయంగావుంది.

ఇంతలో సుబ్బమ్మ యింట్లోకొచ్చింది.

వేణు గదిలోకెళ్లాడు.

చిట్టిచేత జవాబు పంపుతుందేమోనవి ఎదురు చూశాడు వేణు. చిట్టి రాలేదు. ప్రతిరోజూ పెద్దపెద్దగా మాట్లాడుతుంటే విమల మౌనంగా వుంది—

ఆరాత్రి వేణుకి సరిగ్గా నిద్రపట్టలేదు. తలుపు తెరచుకొని మధ్యరాత్రిలో బయటికొచ్చాడు. నల్లని మేఘాలు తెల్లని ఆకాశాన్ని కప్పివేస్తున్నాయి.

లోనికి వచ్చి పడుకున్నాడు.

విమల దుఃఖిస్తూ వుండగా తాను పరాయి యువతి మెడలో మంగళసూత్రం కడుతున్నట్లు కల వచ్చింది.

తెల్లవారింది.

కాని వేణు అలాగే పడుకుని ఆలోచిస్తున్నాడు. బయటికి పోవడానికి మనస్సు ఒప్పుకోవడం లేదు.

'రాత్రి వాళ్ళంతా మాట్లాడుకుని ఏదో ఒక నిర్ణయానికి వచ్చివుంటారు. వాళ్ళ ముఖాలు ఎలా చూసేట్టు?' అనుకున్నాడు వేణు.

"నేను అనుకుంటూనే వున్నాను. అంత పనీ జరిగింది...అయ్యయ్యొ, ఇలా అయితే ఎలా?" అని ఏకరువుపెడుతుంది సుబ్బమ్మ-ఆమె చిమ్మే కసువు కొంచంత యెత్తున వేస్తుంది! వేణుకి తలతిరిగినట్లయ్యింది. ఇక మంచంమీదనుండి. లేస్తే మర్యాద దక్కదనుకున్నాడు. అలాగే ముసుగుతన్ని పడుకున్నాడు.

ఎవరో తలుపు తట్టిన చప్పుడయ్యింది.

వేణుగుండె జారిపోయింది.

"వేణూగారు, వేణూగారూ, కొంచెం తలుపు తీస్తారా?"

ఆపిలుపు, కృష్ణమూర్తిదని తెలుసుకున్నాడు వేణు. లేచిపోయి తలుపు తీశాడు.

"మీరు ఈగది..." అన్నాడు కృష్ణమూర్తి.

వేణుకి వెఱ్ఱిధైర్యం వచ్చింది.

"వెంటనే ఖాళీచెయ్య మంటారు. అంతే కదూ?"

"ఖాళీచెయ్యవలసి వచ్చేదే...కాని"

"ఆఁ!..."

"అదే—మీరు దయచేసి అమ్మాయి విమలకు ఇంగ్లీషు ప్రైవేటు చెప్పాలి. అమ్మాయి మీవద్ద నేర్చుకోవాలంటున్నది. మీరు ఎమంటారో కనుక్కుందామని..."

కృష్ణమూర్తికి చెయ్యెత్తి దండం పెట్టాలనిపించింది వేణుకి—

"అలాగే, మీయిష్టం" అనేశాడు అప్రాయత్నంగా వేణు.

"అయ్యయ్యో, నేను బీరపాదు లేననుకున్నాను. సొరపాదులు కూడా కొట్టేశాయండి పాడు ఎలుకలు!" అన్నది అవతల సుబ్బమ్మ కసువు చిమ్ముతూనే!

బైట చిన్నచిన్న చినుకులు పొన్న పువ్వుల్లా రాలుతున్నాయి.

వేణుకి మాత్రం వాన వెలిసినట్లయ్యింది!

★